

# ఎన్నిక

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఇంటర్వ్యూ సరిగ్గా పదకొండున్నరకి.

నేను బెంగుళూర్ తొమ్మిదిన్నరకి చేరుకున్నాను. నాకోసం నన్ను ఇంటర్వ్యూకి పిలిచిన కంపెనీవాళ్లే ఓ పెద్ద హోటల్‌లో గది బుక్ చేశారు.

సరాసరి ఆ హోటల్‌కి చేరుకున్నాను ఆటోలో. నా పేరు చెప్పగానే గది నంబర్ చెప్పి, గది తాళంచేతులు అందించారు నాకు. హోటల్ బాయ్ నా సూట్‌కేస్ తీసుకువస్తే టిప్ దొరకచ్చని ఆశపడ్డాడు కాని చిన్న బ్రీఫ్‌కేస్ మాత్రమే వుంది నా దగ్గర. ఒక్కరోజే నేను బెంగుళూరులో వుండేది. మద్రాస్‌నుంచి బెంగుళూరుకి నిజానికి అదికూడా అవసరంలేదు. కాని తెచ్చాను.

గదిలో బ్రీఫ్‌కేస్ తెరిచి, టవల్ తీసి ముందర మొహం కడుక్కున్నాను. ఆ గదిలోని డ్రెస్సింగ్ టేబిల్‌కున్న డ్రాయర్ తెరిచాను నా కాగితాలు పెడ్దామని.

ఎదురుగా ఆ డ్రాయర్‌లో నా గుండె ఝల్లుమనేలా వుంది రూపాయలకట్ట. ఆ కట్టలో ఉన్న ఒక్క రూపాయి నోట్లే - పాతవి, కొత్తవి, నలిగినవి, నలగనివి, అన్నిరకాల రూపాయి నోట్లున్నాయి. లెక్క పెట్టాను, వందరూపాయలు సరిగ్గా.

బహుశా ఆ గది ఖాళీచేసినవాళ్లు దాన్ని అక్కడ దాచి, ఖాళీచేసేటప్పుడు తీసుకోవడం మర్చిపోయి వుంటారు. జేబులో వేసుకుని, వెంటనే ఇంటర్వ్యూకి హాజరవడానికి బయలుదేరాను. దారిలో ఆ కట్ట ఓ షాపులో ఇచ్చి, వంద రూపాయలనోటు తీసుకున్నాను. ఆ హోటల్‌వాళ్ళకి డబ్బు మర్చిపోయిన సంగతి వాళ్లు వచ్చికానీ, ఫోన్‌చేసికానీ చెప్పినా, నన్ను వెదికితే అది దొరకదిక.

ఇంటర్వ్యూలో అన్ని ప్రశ్నలకి సమాధానాలు చెప్పాను. మద్రాస్‌లో నేను పనిచేసే కంపెనీలో నేను నిర్వహించే బాధ్యతలకన్నా ఇక్కడ ఇంకా ఎక్కువ నిర్వహించాలి. అందుకే జీతం వెయ్యి కాక, పదిహేనువందలు ఇవ్వడా




నికి సిద్ధమయ్యారు వాళ్ళు. ఎపాయింట్ మెంటు ఆర్డర్ నాలుగయిదు రోజుల్లో పంపుతామని చెప్పారు.

హోటల్ గదికి తిరిగి వచ్చాను. ఎవరూ ఆ డబ్బు గురించి అడగలేదు. వెంటనే ఖాళీచేసేశాను. అనవసరంగా కష్టం కోసం ఎదురుచూస్తూ కోర్చోడం ఇష్టంలేక. వెంటనే మద్రాస్‌కి వెళ్ళే బస్ ఎక్కాను, ఆ రాత్రి ఉండకుండానే.

నాలుగోరోజు నన్ను ఇంటర్వ్యూ చేసిన కంపెనీనుంచి ఉత్తరం వచ్చింది. ఆత్రంగా కవరు విప్పాను. అపాయింట్ మెం ఆర్డర్ కాదది. వుద్యోగం ఇవ్వటం లేదని వ్రాసిన రిగ్రెట్ లెటర్. ఇంకా ఇలా వ్రాశారు.

"మీకు ఇద్దామనుకున్న పోస్టులో పనిచేసేవ్యక్తి మంచివాడు. లంచాలు పుచ్చుకోనివాడు. దొంగతనం చేయనివాడు. ముఖ్యంగా అవినీతిపరుడై వుండకూడదు. మీ మంచితనం నిర్ణయించడాని కోసం, మీరు బసచేసిన హోటల్ గదిలో ముందుగా వందరూపాయలుంచాం. మీరు ఆ వందని హోటల్ యాజమాన్యం వాళ్లకి తిరిగి ఇచ్చేసి వుండాల్సింది. అది న్యాయం. మీరు దాన్ని సంగ్రహించటం మీ స్వభావాన్ని ప్రదర్శిస్తోంది. దయచేసి ఆ వంద పంపవలసిందిగా కోరతున్నాం లేదా మీరు ప్రస్తుతం పనిచేస్తున్న కంపెనీకి ఈ సంగతి తెలియచేయాల్సి వుంటుంది."